# మీడియా సంగతులు

స్పేసీచాట్ వెబ్ జర్నలిజం

జర్నలిస్టుల భార్యలారా! ఏకంకండి

సెన్సార్ కత్తెరకు పదునెంత?

మీడియాలో గాడ్‌ఫాదర్లు

పత్రికలు చదవకండి టీవీలు చూడకండి

రామోజీ మానస పుత్రిక

మీడియా ఓవర్ యాక్టివిజమ్

గోవిందరాజు చక్రధర్

**MEDIA SANGATULU**

(ESSAYS ON MEDIA TRENDS)

**GOVINDARAJU CHAKRADHAR**

© Author

First Edition : 2014

Printed & Published by

**Dr. G. Chakradhar**

for Media House Publications

**COMPOSING & LAYOUT DESIGN:** Raghava Swamy Kamani

**Cover Design:** M. Ruthvik

For copies

**Media House publications**

304, Sri Datta Homes,

Bagh Amber pet,

HYderabad-500 013.

M: 98498 70250

**All Leading Book Stalls**



# జస్ట్ జర్నలిజం

**రేపూరు ఉమామహేశ్వరరావు**
ప్రిన్సిపల్
**రచన జర్నలిజం కళాశాల**

**అ**ప్పుడే కళ్లు తెరిచి ఈ ప్రపంచంలోకి వచ్చిన పాపాయికి చాన్నాళ్లు అమ్మే అన్నింటికీ ఆలంబన అవుతుంది. తొమ్మిది నెలల పేగుబంధం మరిన్ని మారాకులు తొడుగుతుంది. మాతృత్వ మధురిమలు తల్లికి అనుభూతికి వస్తాయి. బిడ్డ ఆలనలో, పాలనలో తల్లి తనను తాను మైమరచిపోతుంది. బిడ్డ ప్రతి చేష్టా తల్లికి సంబరమే.

బిడ్డ తొలి ఎరుక తల్లి. అమ్మ చిరునవ్వుల మోమును, లాలిపాటల గొంతును గుర్తు పట్టటంతో మొదలైన ఈ ప్రాపంచిక జ్ఞానం, మానవ సంబంధం దొంతర్లుగా విస్తరిస్తూ సాగుతుంది. తల్లి తర్వాత తండ్రి, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు, మావయ్యలు, అత్తయ్యలు, ఇతర బంధువుల పలకరింపులతో ఊరడింపులతో ఇంతై, ఇంతింతై, వటుడింతైలా పెరుగుతుంది. బిడ్డ ఎదిగే కొద్దీ, పెరిగే కొద్దీ బోర్లాపడటం, కూచోవడం, పారాడటం, బుడి బుడి అడుగులతో జీవన ప్రయాణానికి సన్నద్ధమవుతాడు. ఇక స్కూల్లో చేరాక కొత్త ప్రపంచంలో అడుగిడతాడు. కొత్త స్నేహితులు, గురువులు.

ఈ సమాజంలో బతకటానికి ఈ సమాజం గురించిన ఎరుక అవసరం. జ్ఞానం అవసరం. ఈ ప్రపంచపు విషయాలను, మాయలను మర్మాలను ఎక్కువగా ఒంట బట్టించుకున్న వాడు బతకనేర్చిన వాడవుతాడు.

సమాజంతో మన బంధానికి తొలి వారధి తల్లి అయితే, పెరిగే కొద్దీ ఈ తల్లి పాత్రను పరోక్షంగానో ప్రత్యక్షంగానో జనమాధ్యమాలు పోషిస్తాయి. పత్రికలు, టీవీల వంటి జనమాధ్యమాల ద్వారానే నిత్యం ఈ ప్రపంచంలోని మార్పులను ఆకళించుకుంటూ ఈ సమాజంలో క్రియాశీల భాగస్వామిగా మనగలుగుతున్నాం. మన చుట్టూ ఉన్న సమాజంతో మన బంధాన్ని దృఢతరం చేస్తోంది ఈ మీడియానే. ముఖ్యంగా ప్రజాభిప్రాయమే ప్రాణంగా విలసిల్లే భారత్ వంటి ప్రజాస్వామిక దేశాల్లో మీడియా పాత్ర మరింత కీలకం. ప్రజలకు చెప్పాల్సింది, సరైనదారి చూపాల్సింది మీడియానే.

బిడ్డకు ఈ ప్రపంచాన్ని అమ్మ పరిచయం చేసేటప్పుడు అసత్యాలు చెప్పదు. ఊహలకు రెక్కలు తొడిగే జోలపాటలు పాడుతుందేగానీ చంద్రుడిని చూపించి సూర్యుడని భ్రమకల్పించదు. అమ్మ మాదిరే అక్షరాల ద్వారా అక్కున చేర్చుకోవాలని, ఈ ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలని, సరైన దిశానిర్దేశం చేయాలని మీడియాను కోరుకోవటం సహజం. చేయిపట్టి సమాజాన్ని నడిపించాల్సిన మీడియా ఆ కృషిలో ఎంత వరకూ సఫలీకృతం అవుతోంది? అన్ని విషయాలను రాగద్వేషాలకు అతీతంగా తామరాకు మీద నీటి బొట్టులా ఉన్నది ఉన్నట్లుగా నివేదిస్తోందా? బోధపరుస్తోందా?

ప్రజాహితాన్నే పరమ ధర్మంగా శిరసుకెత్తుకోవలసిన మీడియా ఎందుకు ఆ బాధ్యతా నిర్వహణలో వెనకంజ వేస్తోంది? ఈ వైఫల్యానికి బాటవేస్తున్న కారణాలేమిటి? వ్యవస్థలు ఏమిటి?

మీడియా తీరు తెన్నులు రాను రాను ప్రశ్నార్థకమవుతున్నాయి. మీడియా చెప్తున్న దానితో పాటు, మీడియా పనితీరు గురించి కూడా తెలుసుకోవాలన్న ఆసక్తి జనసామాన్యంలో పెరుగుతోంది.

మరోపక్క జర్నలిజం విద్యను తరగతి గదిలో నేర్చుకుని మీడియా రంగంలో ప్రవేశించాలని యువత ఉవ్విళ్లూరుతోంది. తరగతి గదిలో జర్నలిస్టులను తయారు చేయలేమన్న భావనలు రూపుమాసిపోతున్నాయి. పట్టుదల, సరైన శిక్షణ ఉంటే ఎవరైనా జర్నలిస్టు కావచ్చన్న అభిప్రాయం బలపడుతోంది. ఆరో తరగతి పాఠ్య పుస్తకాల్లో జర్నలిజం పాఠాన్ని చేర్చారంటేనే ఈ రంగానికి ఉన్న ప్రాధాన్యం అర్థమవుతుంది. రాష్ట్రంలోని చాలా కాలేజీల్లో డిగ్రీ స్థాయిలో జర్నలిజం ఓ పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి విశ్వవిద్యాలయం, పీజీ స్థాయిలో జర్నలిజం కోర్సులను అందుబాటులోకి తెచ్చింది. తెలుగు దిన పత్రికలు, టీవీల తీరు తెన్నులపై పరిశోధనలూ సాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు మీడియాకు సంబంధించిన వివిధ అంశాలను వివిధ కోణాలలో లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. తెలుగులో ఇప్పటికీ జర్నలిజానికి సంబంధించిన ప్రామాణిక పుస్తకాలు అందుబాటులోకి రాలేదు. ప్రజల అవసరాలు, ఆసక్తులకు దీటుగా మీడియాను అధ్యయనం చేసి రాసేవారు తెలుగులో వేళ్ల మీద మాత్రమే కనిపిస్తారు.

ఆ కొద్దిమందిలో గోవిందరాజు చక్రధర్ ఒకరు. తెలుగు జర్నలిజంలో మూడున్నర దశాబ్దాలుగా ఆయన కొనసాగుతున్నారు. ముఖ్య దినపత్రికలలో

పదిహేనేళ్లపాటు పనిచేసిన చక్రధర్ జర్నలిజంలో విద్యార్హతలు కూడా పొంది పూర్తిగా జర్నలిజం విద్యారంగానికే జీవితాన్ని అంకితం చేశారు. రచన జర్నలిజం కళాశాలకు పుష్కరకాలం ప్రిన్సిపల్‌గా విశిష్టసేవలు అందించారు. మీడియా హౌస్ పబ్లికేషన్స్‌ను నెలకొల్పి సుమారు 50 పుస్తకాలను ప్రచురించారు. రాంభట్ల కృష్ణమూర్తి, బూదరాజు రాధాకృష్ణల ఆత్మకథలు వెలుగులోకి తెచ్చారు. జర్నలిజం విద్యార్థులకు పనికొచ్చే పుస్తకాలను రాసి అందుబాటులోకి తెచ్చారు.

1988లోనే మీరూ జర్నలిస్టు కావచ్చు అనే పుస్తకం ద్వారా పాఠకుల ఆదరాభిమానాలకు పాత్రులయ్యారు. ఈ పుస్తకం ప్రేరణతో జర్నలిజం రంగంలోకి చాలా మంది ప్రవేశించారు. వారిలో కొందరు మీడియాలో ఇప్పుడు కీలక భూమిక పోషించటం విశేషం. సుప్రసిద్ధ జర్నలిస్టుల వ్యక్తిత్వ చిత్రణలను, ఇంటర్వ్యూలను అనుబంధంగా మీరూ జర్నలిస్టుకావచ్చు పుస్తకంలో చేర్చారు. అలా తెలుగులో మొదటిసారిగా మీడియా విశ్లేషకుడిగా ఈ రంగం అధ్యయనానికి శ్రీకారం చుట్టిన ఖ్యాతి చక్రధర్‌కు దక్కింది. మీడియాకు సంబంధించిన వివిధ అంశాలపై విశ్లేషణ పూర్వక వ్యాసాలు రాస్తూ ఆ కృషిని నిర్విరామంగా కొనసాగిస్తున్నారు.

జర్నలిస్టుల కోసం, అనువదించడం ఎలా? ప్రచారం పొందడం ఎలా? వంటి పుస్తకాలనేకం చక్రధర్ రచించారు. కొంత కాలం పాటు ప్రాంతీయ ఫిల్మ్ సెన్సార్ సభ్యులుగా కూడా పనిచేశారు. ది ఘోస్ట్, గోరంత దీపం నవలలు రాశారు. కొన్ని కథలు చెక్కారు.

వివిధ విశ్వవిద్యాలయాలు, ప్రెస్ అకాడమీ నిర్వహిస్తున్న జర్నలిజం శిక్షణ తరగతుల్లోనూ సదస్సుల్లోనూ పాల్గొంటూ జర్నలిజం అధ్యాపకుడిగా, విశ్లేషకుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. తెలుగునాట చక్రధర్ శిష్యులు వేల సంఖ్యలో ఉన్నారు.

జర్నలిజం అధ్యాపకుడిగా, రచయితగా, ప్రచురణ కర్తగా బహుముఖ కృషి చేస్తున్న చక్రధర్ నిగర్వంగా, నిరాడంబరంగా అందరితో కలివిడిగా ఉంటారు. పాలకులెంత ముఖ్యమో, ద్వారపాలకులూ అంతే ముఖ్యమన్నది ఆయన విశ్వాసం.

జర్నలిజంలో దశాబ్దాల అనుభవం, అధ్యయనం, వాటితో మేళవించిన సునిశిత పరిశీలన, అవగాహనలతో చక్రధర్ ఈ పుస్తకాన్ని మీ ముందుకు తెచ్చారు. ఐదు విభాగాలలో మొత్తం 42 వ్యాసాలు, విశ్లేషణలు ఉన్నాయి. అన్నీ ఆసక్తిగా చదివిస్తాయి. అవగాహనను ఏర్పరుస్తాయి. ఆలోచింపజేస్తాయి. సాధారణ పాఠకుల నుంచి జర్నలిస్టుల దాకా అందరికీ పనికివచ్చే విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

పత్రికల నుంచి పుస్తక ప్రచురణ రంగం వరకూ తొలి భాగంలో అవగాహన ఏర్పరచారు. సినిమాల సెన్సార్ పరిమితులను, సెన్సారింగ్ లోటుపాట్లను స్వీయ అనుభవంతో విడమరిచారు. రెండు ప్రముఖ దినపత్రికలు ఈనాడు, సాక్షి ఆవిర్భావ వికాసాలను కళ్లకు కట్టించారు. పత్రికల పాలసీకి బాట వేస్తున్న అంశాలను వివరించారు. పత్రికల మధ్య ప్రత్యక్ష అక్షర సమరం మంచి చెడులను చర్చించారు.

జర్నలిజం వృత్తికి సంబంధించిన వివిధ పార్శ్వాల గురించి కూడా పలు వ్యాసాలలో విపులంగా వివరించారు. జర్నలిస్టుల భార్యలు పడే కష్టాలకు, వారి ఆలోచనలకు 'జర్నలిస్టుల భార్యలారా! ఏకంకండి' పేరిట అక్షర రూపం ఇచ్చారు. ఈ వ్యాసం జర్నలిస్టుల భార్యల ఆలోచనలకు అద్దం పడుతూ వారిని విశేషంగా ఆకట్టుకుంటుంది. జర్నలిస్టులు విధి నిర్వహణలో ఎలా మెలగాలో కూడా చక్కగా విడమరిచారు.

ప్రజాజీవన రంగంలోని నాయకులు మీడియా వారి పట్ల ఎలా ఉండాలో కూడా సూచించారు. ప్రజల పక్షాన, పాఠకులు, ప్రేక్షకుల పక్షాన నిలిచి మీడియా తీరు తెన్నులను నిలదీశారు. లోతైన ఆలోచన చేశారు.

మీడియా లోటుపాట్లను పట్టి చూపడంలో చక్రధర్ ఎక్కడా నీళ్లు నమలలేదు. తాను నమ్మిన దాన్ని సూటిగా, నిర్మొహమాటంగా రాశారు. అదే సందర్భంలో మంచిని మంచిగా చెప్పటానికీ ఎక్కడా సందేహించలేదు. విజ్ఞులైన పాఠకులు, మీడియా సంస్థలు ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ సూచనలు విశ్లేషణల నుంచి మంచి మార్పునకు శ్రీకారం చుడతారని ఆశిద్దాం.

తెలుగు పత్రికలకు చాలా చరిత్ర ఉన్నా టీవీ చానళ్లు, వెబ్ జర్నలిజం మాత్రం కొత్తగా రంగ ప్రవేశం చేశాయి. కాలంతోపాటు సరికొత్త అనుభవాలతో తమను తాము తీర్చి దిద్దుకోవలసిన బాధ్యత ఈ మాధ్యమాలపై ఉంది. స్వార్థం వీడి, సమాజ శ్రేయస్సుకు విశాల జనహితానికి మీడియా పునరంకితం కావలసి ఉంది. ఇది నిరంతరం సాగాల్సిన ప్రక్రియ.

జర్నలిజం విషయాలకు అంకితమై చక్రధర్ రాసిన ఈ పుస్తకం అన్ని వర్గాల పాఠకుల చేత ఆసక్తిగా చదివిస్తుందని నమ్ముతున్నాను. మీడియాపై మరిన్ని పుస్తకాలు చక్రధర్ కలం నుంచి వెలువడాలని అభిలషిస్తున్నాను.

# విషయ సూచిక

**✻ విహంగ వీక్షణం ..................................11**

1. కాలంతో మారుతున్న పత్రికలు.......................13
2. బొమ్మల కొలువుతో వన్నెతగ్గని అక్షరం ................18
3. బుల్లితెర వెన్ను ఇంకా బలహీనమే......................30
4. సెన్సారు కత్తెరకు పదునెంత? .........................38
5. స్పైసీచాట్ వెబ్ జర్నలిజం...........................50
6. పాత బంగారులోకం................................57
7. నే రచయితనెట్లయిత?.............................61

**✻ ఫోకస్ .............................................67**

1. రామోజీ మానస పుత్రిక.............................69
2. రాజకీయ అవసరాల సాక్షి..........................79
3. చీకటిలో చిరుదివ్వెలు చిన్నపత్రికలు ...................85
4. పాలసీ దట్ మాటర్స్ ..............................89
5. కత్తులు దూస్తున్న అక్షరాలు .........................95
6. చెల్లింపు వార్తల చిక్కులు...........................100

**✻ జర్నలిస్టుల కోసం ...............................105**

1. జర్నలిజం మరీ అంత చెత్తవృత్తా? ....................107
2. జర్నలిస్టులకు కనీస విద్యార్హత సాధ్యమేనా?..........116
3. జర్నలిజం చదువులు..............................120
4. మీడియాలో గాడ్‌ఫాదర్లు...........................127
5. ప్రెస్ అకాడమీ సాఫల్య వైఫల్యాలు......................131
6. పత్రికే పరమ గురువు ............................138
7. ఓ 'గీతో'పదేశం ................................141

8. ప్రశ్నించే పద్ధతి ఇదేనా? ................................145
9. పాకుడురాళ్ల ప్రమాదం ...................................150
10. వియ్యాలా? కయ్యాలా? ..................................153
11. టీవీలతో పోటీపడాల్సిందే.....................................156
12. పోలీసులూ మానవమాత్రులే ...............................159
13. నేరవార్తలు రాస్తున్నారా? ..................................162
14. జర్నలిస్టుల భార్యలారా! ఏకంకండి.....................168
15. అమెరికన్ రిపోర్టర్ అనుభవాలు.........................172

**❊ జన నేతల కోసం ................................179**

1. పత్రికలు చదవకండి- టీవీలు చూడకండి ...........181
2. మీడియా మీకెంతో మీడియాకూ మీరంతే ............190
3. మీరు చెప్పేదొకటి- వారు రాసేదొకటి ...............194
4. నిగ్రహం కోల్పోతే నిందలే ...............................198

**❊ విశ్లేషణలు ........................................203**

1. పాఠకుల హక్కుల మాటేమిటి?...........................205
2. మరీ అంత అజ్ఞానులా?......................................214
3. ఎందుకీ పరాచికాలు? ......................................217
4. హద్దులు దాటుతున్న వ్యాఖ్యలు.........................221
5. వార్తలకు రంగులు ...........................................225
6. పగలూరేయీ వార్తల జాతర ................................229
7. మీడియా ఓవర్ యాక్టివిజమ్ ..............................232
8. అత్యుత్సాహంతో అనర్థం ...................................236
9. పరిహాసాలకైనా హద్దుండాలి ..............................240
10. మీడియాట్రయల్ అవసరమా?...............................245

**❊ మీడియా ప్రముఖులు (ఛాయా చిత్రమాలిక) ..................249**

# విహంగ వీక్షణం

# కాలంతో మారుతున్న పత్రికలు

**ఒ**కప్పుడు పత్రికా నిర్వహణ, పత్రికా రచన ఓ మిషన్. నిర్వాహకులైనా, పత్రికా రచయితలైనా అక్షరాలే ఆయుధాలుగా కష్టనష్టాల కోర్చి ప్రజలను జాగృతం చేసేవారు. ఇప్పుడు పత్రికా నిర్వహణ ఓ వ్యాపారం. పత్రికా రచన ఓ వృత్తి. ఈ పరిధిలోనే పత్రికల పోకడలను, విలువల్లో మార్పులను అవలోకించాల్సి ఉంటుంది. అలాగని గతకాలపు పత్రికలే మహాద్భుతాలని, నేటి పత్రికలు ఫక్తు వ్యాపార సంస్కృతిని పుణికి పుచ్చుకున్న వినియోగ వస్తువులు మాత్రమేనని అనడమూ పొరబాటే అవుతుంది.

ఒక కాలపు అవసరాలు, ఆకాంక్షలు, ఉద్యమస్ఫూర్తి, ఆ కాలపు వ్యవస్థలను తీర్చిదిద్దుతాయి. అవసరాలు, ఆకాంక్షలు మారే కొద్దీ, ఉద్యమ స్ఫూర్తి వెనకబడే కొద్దీ వ్యవస్థల్లోనూ అది ప్రతిఫలిస్తుంది. పత్రికా వ్యవస్థ అందుకు అతీతమైందేమీ కాదు.

వెనకటితరం పత్రికా రచయితలు మహా పండితులు. విషయజ్ఞులు. ఆదర్శప్రాయులు. వారి భాషాజ్ఞానం, సాహిత్యజ్ఞానం గొప్పవి. వృత్తి విలువలపట్ల నిబద్ధత ఘనతరమైంది. అలనాటి రచనలు ప్రజల ఆలోచనా ధోరణులపై, సాంఘిక రాజకీయ ఉద్యమాలపై ప్రభావం చూపాయి. సమాజానికి దిశానిర్దేశం

చేశాయి. నాటి పత్రికల అమ్మకాలు తక్కువైనా ప్రభావం ఎక్కువ.

స్వాతంత్ర్యానంతరం లక్ష్యాలు మారాయి. ప్రజలను ఏకీకృతం చేసే ఆలంబన కొరవడింది. అప్పటివరకూ తెలుగుజాతి కరదీపికలుగా వర్ధిల్లిన కొన్ని పత్రికలు కొండెక్కాయి. మరికొన్ని పత్రికలు మినుకుమినుకుమంటున్నాయి.

యాజమాన్యతరం మారడం, కాలానుగుణమైన మార్పులకు దీటుగా ఎదగకపోవడం, నిర్వహణా లోపాలు ఈ పత్రికలకు శాపాలయ్యాయి. మరోపక్క కొత్తనీరు వచ్చి, పాతనీటిని కొట్టేసిన చందంగా గత శతాబ్ది ద్వితీయార్ధంలో వెలసిన కొన్ని తెలుగు పత్రికలు అన్నింటా ముందునిలిచాయి. తొలితరం యాజమాన్య నిర్వహణ, వ్యాపారదక్షత, ఎప్పటికప్పుడు మార్పులను పుణికి పుచ్చుకోవడం, మార్కెటింగ్ వ్యూహాలు ఈ పత్రికలకు వరప్రసాదమైంది.

పార్టీ సిద్ధాంతాల ప్రచారం కోసమే ఆవిర్భవించిన పత్రికలు పరిమిత సర్క్యులేషన్‌తో కొనసాగుతున్నాయి. ఇటీవలి కాలంలో పార్టీ పత్రికలను కూడా సర్వజన సమ్మతంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పార్టీ పత్రికలూ మల్టీ ఎడిషన్లతో విస్తరించడం, తద్వారా పోటీలో నిలబడాలని పరితపించడం కనిపిస్తోంది.

**మల్టీ ఎడిషన్ల వెల్లువ:** ఒకప్పుడు విజయవాడ, హైదరాబాద్ కేంద్రాలకే పరిమితమైన తెలుగు పత్రికలు ఇప్పుడు మల్టీ ఎడిషన్లతో విశ్వరూపం దాల్చాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోనే కాక, రాష్ట్రేతర ఆంధ్రుల కోసం దేశంలోని ముఖ్య ప్రాంతాల్లో ఎడిషన్లు ప్రారంభించడం ముఖ్య పరిణామం. ప్రింటింగ్, కంప్యూటర్ టెక్నాలజీల ద్వారా వచ్చిన మార్పులు, సౌలభ్యాలు పత్రికల రూపురేఖలను మార్చేశాయి. హ్యాండ్ కంపోజింగ్‌తో, నలుపు తెలుపు ఫొటోలతో నిస్తేజంగా ఉండే ఒకనాటి పత్రికలకు, నిత్యం రంగుల హంగులతో శోభాయమానంగా వెలువడుతున్న నేటి పత్రికలకూ ఎక్కడా పొంతన లేదు. టెక్నాలజీ సదుపాయాలతో క్షణాల్లో వార్తలను చేరవేసే సౌలభ్యాలు అందివచ్చాయి.

**గ్రామసీమలకు పట్టం:** ఒకప్పుడు తెలుగు దినపత్రికల్లో అంతర్జాతీయ వార్తలకు ప్రథమ ప్రాధాన్యం ఉండేది. జాతీయ వార్తలది ద్వితీయ స్థానం. గ్రామీణ వార్తలు సంఘటన జరిగిన వారం, పది రోజులకు అచ్చు భాగ్యానికి నోచుకునేవి. ఇప్పుడీ పరిస్థితి తారుమారైంది. ఎన్‌టిఆర్ శ్రీకారం చుట్టిన మండల వ్యవస్థ విస్తారమైన గ్రామీణ మార్కెట్‌ను కైవసం చేసుకునేందుకు వేదిక అయింది. ఇప్పుడు అన్ని ప్రధాన దినపత్రికలకు మండల స్థాయిలో గ్రామీణ విలేకరులు

పనిచేస్తున్నారు. గ్రామీణ వార్తలకోసం ప్రత్యేకంగా జిల్లా అనుబంధాలకు తెరతీశారు. నిన్నటి దాకా రిపోర్ట్‌కాని అనేక విషయాలు ఇప్పుడు పత్రికల పేజీల్లో ప్రముఖంగా స్థానం సంపాదించాయి. ఈ వెల్లువలో పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకునే రాజకీయ నాయకులూ పుట్టుకొచ్చారు. ప్రజల్లో పట్టు, పలుకుబడి ఎలా ఉన్నా, పత్రికల కాలమ్స్‌లో ప్రాచుర్యం పొందుతూ, 'పేపర్ టైగర్లు'గా విరాజిల్లుతున్న నేతలు అనేకమంది. జిల్లా అనుబంధాలతో స్థానిక, ప్రాంతీయ పత్రికల మనుగడ దుర్లభంగా మారింది. చాలా ప్రాంతీయ పత్రికలు మూతపడిపోగా, కొన్ని పత్రికలు కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నాయి.

**అనుబంధాలు:** ఇప్పటికీ రాజకీయ వార్తలే పత్రికల్లో సింహభాగం ఆక్రమిస్తున్నప్పటికీ సమాజంలోని అన్నివర్గాల వారి సమాచార అవసరాలను తీర్చడం కోసం ప్రధాన దినపత్రికలన్నీ ప్రత్యేక అనుబంధాలను వెలువరిస్తున్నాయి. ఇవాళ డైలీ అనేది కేవలం వార్తలు అందించే పత్రిక మాత్రమే కాదు. బిజినెస్, క్రీడలు, విద్య, వైద్యం, సాహిత్యం, ఆధ్యాత్మికం, సినిమా, పిల్లలు, మహిళలు వంటి అంశాలతో ప్రత్యేకించి ప్రతిరోజూ అనుబంధాలు వెలుగు చూస్తున్నాయి. ఇది మ్యాగజీన్ల మనుగడను ప్రశ్నార్థకం చేసింది. ప్రత్యేక కేటగిరి పత్రికలేవీ దినపత్రికల ధాటికి తట్టుకు నిలబడలేని పరిస్థితి.

ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో పత్రికల చూపు మారింది. సామాజిక, రాజకీయ దృక్కోణంతోపాటు ఆర్థికపరంగా కూడా విషయాలను విశ్లేషించడం పెరిగింది. సంపాదకీయాల్లో, ప్రధాన వ్యాసాల్లో ఆర్థిక విషయాలకు పెద్దపీట వేస్తున్నారు. షేర్ మార్కెట్ పట్ల పాఠకుల్లో పెరిగిన ఆసక్తి దృష్ట్యా బిజినెస్ వార్తలకు ప్రత్యేకంగా పేజీలు కేటాయిస్తున్నారు. ముఖ్యమైన బిజినెస్ వార్తలు, క్రీడా వార్తలు మొదటి పేజీలో కూడా కనిపిస్తున్నాయి.

**పెరిగిన వృత్తితత్వం:** మల్టీ ఎడిషన్లు, జిల్లా అనుబంధాలు, ప్రత్యేక పేజీలతో ఉపాధి అవకాశాలు పెరిగాయి. ప్రభుత్వ ఉద్యోగాలు వెనకబడటం, ప్రత్యామ్నాయంగా పత్రికల్లో విస్తృత ఉపాధికి మార్గం ఏర్పడటంతో వివిధ పూర్వ రంగాలకు చెందిన అనేకమంది జర్నలిస్టులుగా వృత్తి చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విలేకరి నియామకం కోసం సిఫార్సులు, ఒత్తిళ్లు పెరిగాయంటే జర్నలిజానికి పెరిగిన గ్లామర్‌ను ప్రాధాన్యాన్నీ అర్థం చేసుకోవచ్చు. కొత్తగా వృత్తిలో ప్రవేశించేవారికి శిక్షణ ఇచ్చేందుకు ప్రతి పత్రికా జర్నలిజం స్కూలు తెరిచింది. తమ అవసరాల కోసం ఫ్రెషర్స్‌ను తీసుకుని దిగ్విజయంగా శిక్షణ పూర్తి చేసుకున్న

వారిని డెస్క్‌లలో, బ్యూరోలలో నియమిస్తున్నారు. ఈ రకంగా వృత్తితత్వం పెరిగినప్పటికీ, గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న విలేకరులలో చాలా మందికి మొత్తంమీద వృత్తి నిబద్ధత కానీ, వృత్తికౌశలం కానీ అంతగా లేవన్న విమర్శలు వినవస్తున్నాయి. తామరతంపరగా పెరిగిన విలేకరులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారూ లేకపోలేదు. అడ్డదారులు తొక్కడం, ఆశ్రయించడం, బెదిరించడం వంటి విపరిణామాలు ఈ వెల్లువలో ప్రవేశించాయి. జర్నలిజం వృత్తి పలచబడుతోందన్న విమర్శలు అడపా తడపా అధికారులనుంచి, రాజకీయవేత్తల నుంచి వినిపిస్తున్నాయి.

**ఎడిటర్ పాత్రకు గండి:** ఒకప్పుడు పత్రికా రచయితలే పత్రికలు నిర్వహించేవారు. సామాజిక చైతన్యానికి పత్రికలను ఆలంబన చేసుకునేవారు. రానురాను పత్రికా నిర్వహణ కోట్ల రూపాయల పరిశ్రమగా మారింది. దీంతో ఆర్థిక సంపన్నులు పత్రికాధిపతులుగా రంగప్రవేశం చేశారు. కొన్ని సందర్భాల్లో పత్రికాధిపతులే ఎడిటర్లుగా చలామణి అవుతున్నారు. మల్టీ ఎడిషన్లు, యజమానుల వ్యాపారాపేక్ష కలిసి క్రమంగా ఎడిటర్ పాత్రను రెండో సీటుకు నెట్టేశాయి. ఎడిటర్ మాట శిలాక్షరంలా వెలిగే రోజులనుంచి, ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఆబ్లిగేషన్లను ఎడిటర్ శిరసావహించే స్థాయికి వచ్చేశాం. ఎడిటర్ పేరు చెప్పగానే పత్రిక పేరు స్ఫురణకు వచ్చే రోజులకు కాలం చెల్లింది. ఒకటి రెండు మినహాయింపులున్నా, ఎడిటోరియల్‌కు ఒకప్పటి ఆదరణ కొరవడింది. ఎడిటర్ మూర్తిమత్వానికి గండిపడటం ఇందుకు ఒక కారణం.

**పత్రికాభాష ప్రజల భాషగా...:** పత్రికల విస్తృతి, వ్యాప్తి కారణంగా పత్రికా రచయితలు వాడే భాష బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. రాజకీయ నాయకులు కూడా వేదికలపై పత్రికాభాషనే మాట్లాడుతున్నారు. విశ్వవిద్యాలయాలు పత్రికా భాషను ప్రామాణిక భాషగా పరిగణిస్తున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ, ప్రపంచీకరణ ఫలితంగానూ ఎంతో పదజాలం తెలుగులోనూ ప్రవేశిస్తోంది. ఈ కొత్త పదాలకు భావనలకు ఒక్కోసారి తెలుగు పదాలను పత్రికా రచయితలు సృష్టిస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో ఇంగ్లిష్ మాటనే యథాతథంగా వినియోగిస్తున్నారు. ఏదిఏమైనా తెలుగు భాష పరిపుష్టికి పత్రికలు విశేషంగా దోహదపడుతున్నాయి.

**ఉద్యమాలకు ఊతంగా:** ఆధునిక పత్రికారంగం ఉద్యమస్ఫూర్తితో పనిచేసిన రెండు ఉదాహరణలు ప్రముఖంగా కనిపిస్తాయి. ఎన్.టి.ఆర్. స్థాపించిన

తెలుగుదేశం పార్టీకి అండదండగా నిలిచి, ఆ పార్టీ అధికారంలోకి రావడానికి ఈనాడు పత్రిక క్రియాశీల పాత్ర పోషించింది. ఫలితంగా స్థాపించిన తొమ్మిది నెలల వ్యవధిలోనే ఒక ప్రాంతీయ పార్టీ అధికార పగ్గాలు చేపట్టగలిగింది.

రాష్ట్రంలో మద్యనిషేధ ఉద్యమాన్ని ఉధృతస్థాయికి తీసుకురావడంలో, మద్యనిషేధం అమలుపరచడంలో కూడా 'ఈనాడు' ప్రధాన పాత్ర పోషించింది. ఆ తదనంతర కాలంలో మద్యనిషేధాన్ని తొలగించినప్పుడు అదే పత్రిక మిన్నకుండిపోవటం విశేషం.

తెలుగు పత్రికలు తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పాఠకుల నుంచి విరాళాలు వసూలుచేసి ఆపన్నులను ఆదుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. పాఠకులలో వితరణశీల గుణాన్ని పాదుగొల్పడంలో పత్రికలు ముఖ్య భూమికను పోషిస్తున్నాయి.

**పత్రికల గోత్రాలు పాఠకులకు ఎరుకే:** పత్రికల పాలసీని పాఠకులు అర్థం చేసుకునే స్థాయికి ఎదగడం మరో ముఖ్య పరిణామం. తాము చదివే పత్రిక ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతుందో పాఠకులు స్పష్టంగా చెప్పగలుగుతున్నారు. పత్రికల విశ్వసనీయత ఆ మేరకు గండిపడుతున్న విషయాన్ని విస్మరించలేం. అలాగే పరిశోధనాత్మక కథనాలు కొంత వెనకబడ్డాయి.

**రానున్న రోజుల్లో:** అమెరికన్ పత్రికల మాదిరే తెలుగు పత్రికలు కూడా ఎక్కువ పేజీలతో, వివిధ అనుబంధాలతో వెలువడటం హర్షణీయం. గ్రామీణ ప్రాంత వార్తలకు ప్రాధాన్యం పెంచి పత్రికలు అభివృద్ధి ప్రక్రియకు ఊతంగా నిలిచాయి. పత్రికా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతినివ్వడంతో రాబోయే రోజుల్లో కొత్త పత్రికలు వచ్చే అవకాశాలున్నాయి. బడాపారిశ్రామిక సంస్థలు కూడా సమాచార రంగం ప్రాముఖ్యాన్ని గుర్తిస్తుండటంతో గొలుసు పత్రికలకు, మల్టీ చానళ్లకు శ్రీకారం చుట్టవచ్చు. స్వాతంత్ర్యానంతరం ప్రాంతీయ భాషా పత్రికలు సర్క్యులేషన్ల పరంగా పుంజుకుంటూ ఆ ప్రాంత ప్రజల సాంఘిక, రాజకీయ జీవితాలను వేషభాషలను ప్రభావితం చేస్తున్నాయి. భవిష్యత్తులో పోటీతత్వం మరింత పెరిగి వార్తల రాశితోపాటు వాసి కూడా ఇనుమడిస్తుంది.

# End of Preview.

# Rest of the book can be read @

**http://kinige.com/book/Media+Sangatulu**

* * *